క్లుప్తంగా

హుజూరాబాద్ మున్సిపల్ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

హుజూరాబాద్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ గందె రాధిక అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా మొత్తం 20 అంశాలను ప్రస్తావించగా పాలకవర్గ సభ్యులు ఆమోదం తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా బండ్లు తిరిగే కార్యక్రమం ఉన్నందున రూ.45 వేలతో పట్టణంలోని హనుమాన్ గుడికి ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు, డిసెంబర్ 25న క్రిస్మస్ పండుగ సందర్భంగా రూ.లక్షతో వివిధ ఏర్పాట్లు, పారిశుద్య నిర్వహణ కోసం రూ.1.75 లక్షలతో సున్నం, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలుకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల, కమిషనర్ సమ్మయ్య, కార్యాలయ మేనేజర్ కె.రామ్మోహన్‌రాయ్, ఇన్‌చార్జి మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ సాంబరాజు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అశ్విని గాంధీ, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషన్‌రావు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భాస్కర్‌రెడ్డికి నివాళి



చిగురుమామిడి: మండలంలోని ముదిమాణిక్యం గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, సింగిల్ విండో డైరెక్టర్ ఎడవెల్లి భాస్కర్‌రెడ్డికి బుధవారం పలువురు ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు. చిగురుమామిడి సింగిల్‌విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్కుల రవి, ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్లు చాడ శ్రీధర్‌రెడ్డి, అందె స్వామి, ముద్రకోల రాజయ్య, అందె చిన్నస్వామి, లక్ష్మీచారిటబుల్ ట్రస్టు చైర్మన్ గాదె రఘునాథరెడ్డి, రియల్ ఎస్టేట్ వ్యాపారి చీల సతీశ్‌రెడ్డి, కంది రాజశేఖర్‌రెడ్డి, రాజు, చందు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మళ్లీ ప్రహరీ వివాదం

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట ప్రభుత్వ పాఠశాల ప్రహరీ వివాదం మళ్లీ మొదలైంది. ధ్వంసమైన ప్రహరీని నిర్మించడానికి బుధవారం ఉపసర్పంచ్ సంపత్‌రెడ్డి, జీపీ కార్యదర్శి ఆనంద్, పోలీసుల సహాయంతో కూలీలతో కలిసి ప్రభుత్వ పాఠశాల వద్దకు వెళ్లారు. సర్పంచ్ మల్లీశ్వరీ అభ్యంతరం వ్యక్తం చేశారు. సమాచారం ఇవ్వకుండా ప్రహరీ నిర్మాణం సమంజసం కాదన్నారు. దీంతో ప్రహరీ నిర్మించకుండానే అర్ధంతరంగా అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇటీవల ప్రహరీపై పోలీస్‌స్టేషన్‌లో కొందరు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

పదవీకాలం ముగుస్తోంది..

- సమస్యలు పట్టించుకోండి
- మండల సభలో సర్పంచుల మొర
- సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



మండల సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర: పదవి కాలం మరో నెల రోజుల్లో ముగుస్తుంది, గ్రామాల్లోని సమస్యలపై ఐదేళ్లుగా సర్వసభ్య సమావేశంలో మొరపెట్టుకుంటున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. చివరి సర్వసభ్య సమావేశంలో మరోసారి వేడుకుంటున్నం ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించి, పెండింగ్‌లో బిల్లులు ఇప్పించాలని అధికారులకు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు మండలంలోని సర్పంచులు విన్నవించారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ శ్రీరాం మధుకర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించగా ఎమ్మెల్యే మేడిపల్లి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. కురిక్యాల గ్రామంలో పశువైద్యాధికారి లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ నవీన్‌రావు కోరారు. గ్రామాల్లో కోతులు, కుక్కలు, పంటపొలాల వద్ద అడవి పందుల బెడద ఎక్కువగా ఉందని, కోతుల నివారణకు కొండెంగలను తెచ్చుకుంటే కేసులు నమోదు చేస్తున్నారని సమస్యకు పరిష్కారం చూపాలను సర్పంచులు, ఎంపీటీసీలు కోరారు. కుక్కల బెడదకు కుటుంబ నియంత్రణే మార్గమని డీపీవో అనుమతిస్తే చర్యలు తీసుకుంటామని పశువైద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. కోతుల నివారణకు ఎటువంటి మార్గదర్శకాలు రాలేదని, అడవి జంతువుల ద్వారానష్టం జరిగితే పరిహారం చెల్లిస్తామని, అడవి పందుల బెడదపై అధికారుల అనుమతితో చర్యలు తీసుకుంటామని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కరణ్మయ్ పేర్కొన్నారు. గంగాధరలో సబ్‌సెంటర్ మంజూరైన పనులు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే ప్రారంభించాలని సర్పంచ్ గంగాధర్ అన్నా. మండలంలో మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులు వెంటనే పంపిణీ చేయాలని సర్పంచ్ విజయేందర్‌రెడ్డి కోరగా రెండు మూడు రోజుల్లో పంపిణీ చేస్తామని తహసీల్దార్ తెలిపారు. నారాయణపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఇస్తార్‌పల్లి గ్రామస్తులు రేషన్ బియ్యం తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారని, కొత్త షాపు మంజూరు చేయాలని రెండు రోజులు అక్కడనైనా రేషన్ పంపిణీ చేయాలని సర్పంచ్ నజీర్ ప్రస్తావించారు. మండలంలో వర్షాకాలంలో కూలిన ఇళ్లకు పరిహారం ఎప్పుడు వస్తుందని సర్పంచ్ నవీన్‌రావు కోరగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ అన్నారు. ఒద్యారం గ్రామంలో సర్వే నెంబర్134/ఏ/బీలో కురిక్యాల గ్రామంలోని సర్వే నంబర్ 43/ఏ లో దళితులకు పంపిణీ చేసిన భూమి అన్యాక్రాంతం అవుతుందని సర్వే చేసి సమస్య పరిష్కరించాలని సర్పంచులు సంపత్, నవీన్‌రావు కోరారు. ఒద్యారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల సమస్య పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రకృతి వనాలు, కోతుల వనాలు ఉపాధిహామీ పథకం ద్వారా సంరక్షించాలని సర్పంచులు కోరారు. ఇంటింటికీ ఇంకుడుగుంతలు నిర్మించుకున్నా బిల్లులు రాలేదని సర్పంచ్ విజయలక్ష్మి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మల్లాపూర్‌లో వానపడితే కరెంట్ పోతుందని, ఉప్పరమల్యాల సబ్‌స్టేషన్ పనులు వెంటనే ప్రారంభించాలని సర్పంచులు అధికారులను కోరారు. ఉచిత విద్యుత్ సరఫరాను గ్రామ పంచాయతీలకు వర్తింపచేయాలని విషయాన్ని ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సర్పంచులు కోరారు.



హాజరైన సభ్యులు

హామీలు నెరవేరుస్తా..

ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానని, రెండుసార్లు పోటీ చేసి ఓడినా పదేళ్లుగా ప్రజాక్షేత్రంలో ఉన్నా, సమస్యలపై అవగాహన ఉంది ప్రతి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలపై సంతకం చేయడంతో పాటు రెండు గ్యారంటీలను అమలు చేసిందన్నారు. వంద రోజుల్లో హామీలన్ని అమలు చేస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి నియోజకవర్గం అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా పని చేద్దామని ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. సమస్యను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పదోతరగతి ఫలితాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అవసరమైతే ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జనవరి 3 నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

హుజూరాబాద్‌రూరల్: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో జనవరి 3 నుంచి డిగ్రీ ప్రథమ సంవత్సర మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి శ్రీరంగ ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారని మండలంలోని సింగాపూర్ గ్రామం వీఎస్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హనుమకుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మూడు, మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయన్నారు.

సమస్య పరిష్కారం



గన్నేరువరం: మండలంలోని యాస్వాడ గ్రామంలో దళితకాలనీ స్థలంపై ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మండల పరిషత్ అధికారులకు గ్రామస్తులు ఇటీవల ఫిర్యాదు చేశారు. కాలనీ మధ్యలో ఉన్న స్థలంలో సంబంధిత వ్యక్తి పశువుల పేడ వేస్తుండటంతో అపరిశుభ్రం, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు తెలిపారు. స్పందించిన అధికారులు చర్యలు చేపట్టారు. పేడ, ఇతర చెత్తాచెదారాన్ని బుధవారం ట్రాక్టర్ సహాయంతో తొలగించి చదును చేయగా కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

రుద్రారం స్కూల్‌లో మోడల్ పోలింగ్



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఉపాధ్యాయులు

రామడుగు: మండలంలోని రుద్రారం జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు మోడల్ పోలింగ్ నిర్వహించారు. ప్రత్యక్ష ఎన్నికల నిర్వహణలాగే విద్యార్థులు లీడర్‌ను ఎన్నుకున్నారు. వీరితో హెచ్‌ఎం పీవీ రంగనాథశర్మ, ఉపాధ్యాయులు అనంతుల నాగేందర్, అవదూత శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, పద్మజరాణి, నల్లగొండయ్య, రవీందర్, రూపారాణి, శంకర్, లక్ష్మయ్య ప్రమాణస్వీకారం చేయించారు. మోడల్ పోలింగ్‌తో విద్యార్థులకు ఎన్నికల్లో ఓటుహక్కును ఎలా ఉపయోగించుకోవాలనేది తెలుస్తుందని హెచ్‌ఎం తెలిపారు.

బీఎల్‌వోలకు శిక్షణ

జమ్మికుంట: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రజని మాట్లాడుతూ ఎన్నికల నియమ నిబంధనలు పాటిస్తూ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు పని చేయాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, తప్పులను సరిచేయడానికి దరఖాస్తుల స్వీకరణ చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఆర్‌ఐ తిరుపతి, సిబ్బంది, బీఎల్‌వోలు పాల్గొన్నారు.



బీఎల్‌వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్ రజని

టీచర్లకు సన్మానం

జమ్మికుంట: మామిడాలపల్లి హైస్కూల్ నుంచి బదిలీపై వెళ్తున్న టీచర్లు తునికి శ్రీనివాస్‌రాజు, నాగుల భుజన్ చందర్ హెచ్‌ఎం సుద్దాల శోభారాణి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. విద్యార్థుల సంఖ్య పెంపు,దాతలతో వసతుల పెంపులో వారి సేవలను కొనియాడారు. సర్పంచ్ సుజాతకిషన్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్ పర్సన్ లక్ష్మి, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

హుజూరాబాద్ : పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి. చౌరస్తా వద్ద ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీ కొట్టింది. ఈప్రమాదంలో ఆటో బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని వెంటనే ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



చొప్పదండి: విద్యార్థులను అభినందిస్తున్న టీచర్లు

చొప్పదండి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 విభాగం సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొని ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈ నెల 21 నుంచి నిర్మల్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఎస్.సంతోష్, బి.శేఖర్, బి.వైష్ణ వి, కె.అంజలి ఎంపికై నవారిలో ఉన్నారు. విద్యార్థులను హెచ్‌ఎం రాజిరెడ్డి, పీడీ కృష్ణ అభినందించారు.

సైదాపూర్: ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలుర విభాగం కరాటే పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థులు ఎస్.రాకేశ్, హరిచరణ్ ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ ఫర్హానా, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ పోతన శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ మోయిస్, కరాటే మాస్టర్ రాజిరెడ్డి, పీఈటీలు సత్యం, హనుమంతు, ఫిజికల్ డైరెక్టర్ విష్ణువర్ధన్ అభినందించారు.

హుజూరాబాద్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి మల్లెల నిఖిత జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపికై ంది. హెచ్‌ఎం తిరుమల, పీఈటీ సారయ్య బుధవారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలిక ల పాఠశాలకు చెందిన పీఈటీ, ఫిజికల్ డైరెక్టర్ సారయ్య హన్మకొండలో జరిగే క్రీడోత్సవ నిర్వహణ పోటీలకు ఎంపికయ్యాడు. ఈమేరకు బుధవారం హెచ్‌ఎం తిరుమల ప్రకటనలో తెలిపారు.

హుజూరాబాద్: పట్టణంలోని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 7వ తరగతి విద్యార్థి నిమ్మటూరి మిధున జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం గీతా షాజు తెలిపారు. ఈనెల 15,16,17వ తేదీల్లో కామారెడ్డి జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ హాకీ పోటీల్లో ప్రతిభచాటింది. ఈనెల 25 నుంచి మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. విద్యార్థిని మాంటిస్సోరి గ్రూప్ ఆఫ్ స్కూల్ డైరెక్టర్ జీవీకే భరత్‌కుమార్, షాజు తామస్, గంద్ర సుధాకర్‌రెడ్డి, నూకల శ్రీనివాసరావు, డాక్టర్ సుధాకర్ అభినందించారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రాంపూర్ జెడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థి గుల్ల భరత్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం జానపద ప్రదీప్, పీఈటీ రవికుమార్ తెలిపారు. అండర్-17 బాలుర విభాగంలో ఈ నెల 21 నుంచి 23 వరకు హన్మకొండలో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా భరత్‌ను టీచర్లు అభినందించారు.

పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ

సైదాపూర్: మండలంలోని సోమారం ఆదర్శ పాఠశాలలో గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు నిర్వాహకుడు జగదీశ్వర్ బుధవారం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. ఏటా ట్రస్టు ద్వారా విద్యార్థులకు వివిధ రకాలుగా సహాయం చేస్తున్న జగదీశ్వర్‌ను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మోహిద్ అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



రసమయిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణకాలనీలో నిర్మించిన శ్రీసీతారామాంజనేయ సహిత గంగాభవానీశంకర దేవాలయంలో విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవాల సందర్భంగా బుధవారం ఉరుమడ్ల శ్రీనివాసశర్మ నేతృత్వంలో సుమారు 15 మంది బ్రాహ్మణులు హోమంతో పాటు గోపూజ తదితర పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఏడు గంటల నుంచి ప్రారంభమైన పూజలు సాయింత్రం వరకు నిర్విరామంగా కొనసాగాయి. దేవాలయ శిఖరంపై ధ్వజస్థాపన చేశారు. మధ్యాహ్నం ఐదు వందల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, ఆరెపల్లి మోహన్, ఆలయ కమిటీ చైర్మన్ గుజ్జుల శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ మీసాల అంజయ్య, కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, గుజ్జుల రవీందర్‌రెడ్డి, ప్రణీత్ రెడ్డి, రావుల రమేశ్, జగదీశ్వరాచారి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు అతిథులను సన్మానించి తీర్థ ప్రసాదాలు అందించారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు ముస్తాబు

చొప్పదండి: పట్టణంలోని శివకేశవాలయం సమీపంలో నిర్మించిన వనదుర్గా ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఈ నెల 23 నుంచి 25 వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే పట్టణ శివారులో నిర్మించిన జ్ఞాన సరస్వతి ఆలయం తొలి వార్షికోత్సవాలు ఈ నెల 24 నుంచి 26 వరకు నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు నిర్వాహకులు ఆహ్వానపత్రాలు అందించారు.

జ్ఞానయజ్ఞ ఇన్‌చార్జి నియామకం

అంతర్జాతీయ శ్రీకృష్ణచైతన్య సమితి జ్ఞానయజ్ఞ నియోజకవర్గ ఇన్‌చార్జిగా చొప్పదండి పట్టణానికి చెందిన దూస రామును నియమించినట్లు సమితి అధ్యక్షుడు కల్యాణం అప్పారావు, ఉపాధ్యక్షుడు నలుమాచు చంద్రశేఖర్ తెలిపారు. కోరుకొండకు చెందిన కృష్ణశ్రీచైతన్య సమితి ఆధ్వర్యంలో గోటితో వొలిచిన కోటి తలంబ్రాలను సిద్ధం చేయనున్నామని, 25 లక్షల దీపోత్సవం నిర్వహించే అయోధ్య రామయ్య వేడుకలకు ఇంటింటికి శ్రీరామ నామం, చాలీసా పారాయణం వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి రాము తెలిపారు.



ఎన్‌సీసీ శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కందుకూరి శంకర్

వ్యాయామంతోనే ఆరోగ్యం

హుజూరాబాద్‌రూరల్: వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని కిట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కందుకూరి శంకర్ అన్నారు. సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలోని ఆడిటోరియంలో బుధవారం ఎన్‌సీసీ శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతూ... కెడెట్లు శిక్షణలో నేర్చుకున్న అంశాలపై పూర్తి స్థాయిలో సాధన చేయాలని, ఉదయం, సాయంత్రం వేళ వ్యాయామం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమాండింగ్ ఆఫీసర్ డేనియల్, క్యాంప్ డిప్యూటీ కమాండెంట్ కెప్టెన్ కల్లెం రవీంద్రబాబు, అధ్యాపకులు, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.




మురుగునీటితో ఇబ్బందులు

మానకొండూర్: మండల కేంద్రంలోని కరీంనగర్ వరంగల్ ప్రధాన రహదారి పక్కన డ్రైయినేజీ లేక పోవడంతో మురుగునీరు రహదారి పై ప్రవహిస్తోంది. దీంతో దుర్వాసనతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లుగా మురుగునీరు రహదారిపై పారుతున్న పాలకులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయమై గ్రామ కార్యదర్శి శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

పల్లెల్లో ‘కిష్కిందకాండ’

- గ్రామాల్లోకి వందల సంఖ్యలో కోతులు
- వానరాల దాడులతో గాయాలు, పరుగులు తీస్తున్న జనం
- ఇంటి పైకప్పులు, పంటలను ధ్వంసం చేస్తున్న వైనం
- పగలు, రాత్రి తేడా లేకుండా ఇళ్లలోకి



ఇళ్లలోకి చొరబడుతున్న కోతుల గుంపు

వీణవంక: క్వారీల పేరుతో గుట్టలు కరిగిపోయాయి.. బీడుభూములు పొలాలుగా మారాయి. అడవులు, గుట్టల్లో ఉండాల్సిన కోతులు ఇప్పుడు ఊళ్లపై పడుతున్నాయి. తలదాచుకునే స్థావరాలు ధ్వంసం కావడంతో చేసేది లేక ఇండ్లు, పంటలపై దాడులు చేస్తున్నాయి. దొరికినకాడికి ఎత్తుకెళ్తున్నాయి. ఒకటి కాదు రెండు కాదు గుంపులు గుంపులుగా వచ్చి ఒకేసారి ఎగబడుతూ జనాలను ముప్పుతిప్పలు పెడుతూ ఉరికిస్తున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే చిన్నపాటి దండయాత్రే చేస్తున్నాయి. దీంతో వీణవంక మండలంలోని గ్రామాల ప్రజలకు కోతుల భయం పట్టుకుంది. వీటిబారి నుంచి రక్షించండంటూ వేడుకుంటున్నారు. మండలంలో 26 గ్రామ పంచాయతీలున్నాయి. వీటి పరిధిలో 42 వేల కుటుంబాలు ఉన్నాయి. ఏ క్షణంలో కోతులు దండెత్తుతాయే తెలియక జనం జడుస్తున్నారు. ఇళ్లపైకి ఎక్కి గూన పెక్కలను పీకేస్తున్నాయి. ఇంటివద్ద ధాన్యం, మక్కలు, పప్పు దినుసులు ఆరబోస్తే అంతే సంగతులు, కోతులు గుంపుగా వచ్చి చిందరవందర చేస్తున్నాయి. కూరగాయల చెట్లను ధ్వంసం చేస్తున్నాయి. వీటి బెడద తట్టుకోలేక ప్రజలు తలలు పట్టుకుంటున్నారు. కోతుల బెడద మండలం వ్యాప్తంగా ఉంది.

ధ్వంసమైన గుట్టలు...

చల్లూరు, కోర్కల్, బేతిగల్ గ్రామాలతో పాటు శంకరపట్నం మండలం కల్వల, కాచాపూర్ గ్రామాల్లో గుంటలు ఉన్నాయి. ఇవీ ఇప్పటికే క్వారీల పేరుతో పూర్తిగా ధ్వంసమయ్యాయి. బండరాయి కోసం ఇక్కడ పేలుళ్లు జరుపుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా డిటోనేటర్లు పేల్చుతుండటంతో వాటి శబ్దాలకు కోతులు గ్రామంలోకి చొరబడుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. తల దాచుకునే స్థావరం ధ్వంసం కావడంతో కోతులు గ్రామాల్లోకి చొరబడుతున్నాయి. ఇంటి ముందు ఏది ఆరబోసుకున్న కోతులు తన్నుకుపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చల్లూరు గ్రామంలోకి మంగళవారం సుమారు 800 కోతుల గుంపు చొరబడిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

కూరగాయల తోటలు ధ్వంసం...

ఇంటి పరిసరాల్లో కూరగాయలు సాగు చేసుకున్న రైతులకు కోతుల బెడద పట్టుకుంది. కూరగాయల ధరలు మార్కెట్‌లో బగ్గున మండిపోతుండటంతో రైతులు ఇంటి పరిసరాల్లో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం సొరకాయ, బీరకాయ, టమాట, వంకాయలు కాస్తున్నాయి. కోతులు ఒక్కసారిగా వచ్చి కూరగాయలను కొరికి తెంచేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అటవీశాఖ అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి రక్షించాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు.

గుంపులుగా వస్తున్నాయి



కోతులు గుంపులుగుంపులుగా వస్తున్నాయి. ఎక్కడ దాడి చేస్తాయోనని భయంగా ఉంది. వస్తే ఒకేసారి ఐదువందల వరకు వస్తున్నాయి. పప్పు దినుసులు ఇంటి ముందు ఆరబోస్తే చిందరవంద చేస్తున్నాయి. ఊళ్లో రెండు రోజుల క్రితం ఇద్దరిపై దాడి చేశాయి. తృటిలో ప్రాణాపాయం తప్పింది. గతంలో కోతుల బెడద లేకుండే. ఈ రెండేళ్ల నుంచే విచ్చల విడిగా కోతులు గ్రామాల్లోకి వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కోతుల బెడద లేకుండా చూడాలి.

– గొట్టె నందయ్య, బేతిగల్

ఆటో డ్రైవర్ల నిరసన ర్యాలీ



జమ్మికుంట: పట్టణంలో అంబేడ్కర్ చౌక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఆటో యూనియన్ సభ్యులు బుధవారం ఆటోలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఉచిత బస్సు ప్రయాణంతో ఉపాధి కోల్పోతున్నామని, ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ రజనికి వినతిపత్రం ఇచ్చారు.

హుజూరాబాద్: పట్టణ శివారులోని కేసీ క్యాంపులోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆటో డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు.